క్లుప్తంగా

వేలం ఆదాయం రూ.6.15లక్షలు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం తైబజార్, మేకల బజార్, ఎడ్ల బజార్, పెద్దమాంసం, చిన్న మాంసంలకు సంబంధించిన వేలం పాటలను నిర్వహించారు. యాదుల్ ఖురేషి వేలం పాటల్లో పాల్గొన్న అందరికంటే అధికంగా ఎడ్లబజార్‌ను రూ.3.58 లక్షలు, పెద్దమాంసంను రూ.1.85 లక్షలు, చిన్న మాంసంను రూ.72వేలకు పాటలు పాడి దక్కించుకున్నారని కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. తైబజార్, మేకల బజార్ మార్కెట్లకు సంబంధించి సరైన వేలం ధర రానందున వాయిదా వేసి ఈనెల 15న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని తెలిపారు. కొత్త వారు కూడా నిబంధనల ప్రకారం డిపాజిట్లను 14వ తేదీన చెల్లించి వేలం పాటల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని వివరించారు.

ఉద్యానవన పంటల పరిశీలన


డ్రాగన్ తోటను పరిశీలిస్తున్న అధికారిణి సమత

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్, ఉల్లిగడ్డ పంటల సాగును డివిజన్ ఉద్యానవన శాఖ అధికారిణి సమత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు తగు సూచనలు, సలహాలు అందించారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు విధానం, వాటి మార్కెటింగ్ వంటి అంశాలను రైతులకు తెలియపర్చారు. ఆమె వెంట ఏఈఓ ప్రవీణ్‌కుమార్, రైతులు రాజేందర్‌రావు, పాండు తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమావేశం


ప్రతినిధులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ అశోకచక్రవర్తి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో పార్లమెంటు సాధారణ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ అశోకచక్రవర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలు, పోలింగు కేంద్రాలు, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ తదితర విషయాలను గురించి వివరిస్తూ పార్టీలు ఎన్నికల నిబంధనలను పాటించాల్సిన విషయంలో సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు భాస్కర్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రాజు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎంఐఎం, సీపీఐ పార్టీల ప్రతినిధులు తాహెర్ అలీ, పరమేశ్, నగేశ్, సాయిరాం, మొహీద్‌పటేల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ

చికిత్స పొందుతూ ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన తాయతి బాయాక్ బేరియా(22), అతడు స్నేహితుడు సామ్యతో కలసి బతుకుదెరువు కోసం కంది మండల పరిధిలోని ఇంద్రకరణ్ గ్రామానికి వచ్చి పాశమైలారం పారిశ్రామిక వాడలో ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూరగాయలు కొనేందుకు ఇస్నాపూర్ వెళ్లి తిరిగి ఇంద్రకరణ్ వస్తుండగా పాశంమైలారం పారిశ్రామికవాడలో మైలాన్ కంపెనీ సమీపంలో గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన తాయతి బాయాక్ బేరియాను చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు, మరో యువకుడు సామ్యను చికిత్స కోసం ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాయాక్ బేరియా(22) బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి చర్యలు

జిన్నారం: గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని జిన్నారం మండల బీజేపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన యువజన సంఘాల నాయకులు బుధవారం జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి జగన్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. పీఎం మోదీతోనే దేశ రక్షణ సాధ్యమని సామాన్య ప్రజలు నమ్ముతున్నారన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

వార్షికోత్సవానికి వేళాయె..

- నేటి నుంచి మూడురోజుల పాటు రాచన్నస్వామి జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


రాచన్నస్వామి ఆలయం(ఇన్‌సెట్‌లో స్వామివారు)

కోహీర్(జహీరాబాద్): మండలంలోని బడంపేట గ్రామ శివారులో వెలసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వరూపులైన శ్రీ రాచన్నస్వామి వార్షికోత్సవాలు మూడురోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఆలయానికి వివిధ రంగులు వేసి విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, మంచినీటి వసతి, నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రోజువారీ కార్యక్రమాలు..

మొదటి రోజు 14 తేదీ గురువారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన అనంతరం శ్రీశ్రీశ్రీ శివయోగి శివాచార్య తంగడపల్లి వారితో ధ్వజారోహణం, శిఖర పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి అగ్నిదహన కార్యక్రమం నిర్వహిస్తారు. రెండో రోజు 15వ తేదీ శుక్రవారం తెల్లవారు జామున కోనేటిలో స్నానమాచరించి అగ్ని ప్రవేశం చేసి స్వామివారిని దర్శించుకుంటారు. శివయోగి శివాచార్య ప్రవచనాలు, భజన సంకీర్తనలు ఉంటాయి. ఆఖరి రోజు 16వ తేదీ శనివారం మధ్యాహ్నం 2.25 గంటలకు శ్రీ భద్రకాళి సమేత శ్రీ రాచన్నస్వామివారి కల్యాణ మహోత్సవం. సాయంత్రం 6.30 గంటలకు దేవగురు మఠం రాచయ్య స్వామివారి అశ్వవాహన సేవ, రాత్రి 7.30 గంటలకు స్వామివారి రథోత్సవ కార్యక్రమం అనంతరం అగ్నిగుండం ముగింపు కార్యక్రమంతో ఉత్సవాలకు ముగింపు పలుకుతారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



ఉత్సవాలకు అవసరమగు ఏర్పాట్లు చేశాం. వేసవి దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, అత్యవసర చికిత్స కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేశాం. భక్తుల సౌకర్యార్థం కోహీర్ జహీరాబాద్ నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయించాం. భక్తుల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– శివరుద్రప్ప, కార్యనిర్వాహణాధికారి

ఆలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సీతారామచంద్రస్వామి ఆలయ నిర్వాహకులు

పటాన్‌చెరు: ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు నూతన ఆలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లి గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ సీతారామచంద్రస్వామి, హనుమాన్ ఆలయాల్లో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం జానకంపేట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్‌లు లలిత మల్లేశ్, పాండు యాదవ్, రాజు పాల్గొన్నారు.

ధనసిరి నుంచి మహాపాదయాత్ర


శివాచార్యులను సన్మానిస్తున్న గణేశ్ యువజన సంఘం సభ్యులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ధనసిరి పీఠాధిపతి శ్రీ వీరేశ్వర శివాచార్యుల ఆధ్వర్యంలో శ్రీశైల క్షేత్రం మహాపాదయాత్ర బుధవారం ప్రారంభమైంది. 29 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం అనంతరం శివాచార్యులు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పాదయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. ఈ సంవత్సరం సుమారు 1200 మంది ఆయన వెంట నడుస్తున్నారు. ధనసిరి నుంచి ప్రారంభమైన పాదయాత్ర తాండూర్, కోస్గి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, దోమలపేట మీదుగా శ్రీశైలంకు చేరుకుంటుంది. పదిరోజుల పాటు సుమారు 380 కిలోమీటర్లు దూరం పాదయాత్ర కొనసాగుతుంది. ఈ సందర్భంగా శివాచార్యులు మాట్లాడుతూ.. శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జునస్వామిని భక్తులు చాలా పవిత్రంగా కొలుస్తారని, కొలిచిన వారి కోరికలు తీరుతాయని చెప్పారు. మాజీ సర్పంచ్ హబ్సి రాజు, ఎన్‌ఆర్‌ఐ రవి, బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, ఎంపీటీసీ బాబు, మల్లికార్జున్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, హబ్సి అశోక్, దేవరాజ్, సంతోష్, విజయ్, గణేశ్ యువజన సంఘం నాయకులు నాగేశ్, వీరేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

సంగారెడ్డి అర్బన్: డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థులకు ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు షెడ్యూల్ కులాల అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇస్తున్నామని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఏర్పాటు చేస్తుందన్నారు. టెట్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత కలిగిన షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ఈనెల 12 నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సెమీకండక్టర్ పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్

గీతం చర్చాగోష్టిలో ముఖ్య అతిథి నరేంద్ర



పటాన్‌చెరుటౌన్: సెమీకండక్టర్ పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్ ఉందని, 2030 నాటికి మార్కెట్ విలువ 3.1 ట్రిలియన్ డాలర్లకు పెరగనుందని సినాప్సిస్ సీనియర్ డైరెక్టర్, సైట్ లీడర్ నరేంద్ర కొర్లిపారా చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని జీ-ఎలక్ట్రా, ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్(ఇండియా) విద్యార్థి విభాగం సంయుక్తంగా భారత-సాంకేతిక దశాబ్దం అనే అంశంపై బుధవారం నిర్వహించిన ఒక రోజు చర్చాగోష్టిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గీతంలోని ఈసీఈ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాల సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన 'సెమీకండక్టర్, ఎకోసిస్టమ్, సాఫ్ట్‌వేర్, చిప్స్ ద్వారా నడపబడుతోంది' అనే అంశంపై ప్రసంగించారు. పరిశ్రమకు అవసరమైన ప్రతిభ గల విద్యార్థులను ఉత్పత్తి చేయడంలో విద్యా సంస్థల ప్రాముఖ్యతను ఆయన ఎత్తిచూపారు. సభాధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి మాట్లాడుతూ.. సెమీకండక్టర్ పరిశ్రమపై మనదేశం లక్షల కోట్లను వెచ్చిస్తోందని, చిప్ తయారీ, రూపకల్పన కోసం దేశాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చే మిషన్‌లో చురుకుగా పాల్గొనాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని అంతా వీక్షించడంతో పాటు ఏఎండీ సీనియర్ సిలికాన్ డిజైన్ ఇంజినీర్ ఆయుష్ శర్మతో ముఖాముఖి కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థులతో హెచ్‌ఎం అంజయ్య తదితరులు


రాయికోడ్: స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. స్వయంపాలన దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారారు. హెచ్‌ఎంగా వైష్ణవి, ఎంఈఓగా సింధూజలతో పాటు ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం అంజయ్య బహుమతులను అందించారు.

రాయికోడ్ ప్రాథమిక పాఠశాలలో

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి కిందిస్థాయి తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.విఠల్, ఉపాధ్యాయులు శివకుమార్, సుధాకర్, శ్రావణి, తులసి, పండరి, సుధా, ఎస్‌ఎంసీ చైర్మన్ గోపాల్, సిబ్బంది అంజమ్మలు ఉన్నారు.

కార్పొరేషన్‌ల ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్


పటాన్‌చెరు టౌన్: క్షీరాభిషేకం చేస్తున్న నీలం మధు, తదితరులు


సంగారెడ్డి: సంబరాలు జరుపుకుంటున్న ఆర్యవైశ్యులు

పటాన్‌చెరుటౌన్: 16 కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. 16 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ చిట్కుల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ముదిరాజ్ కులస్తుల చిరకాల స్వప్నమైన ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుతో ముదిరాజ్‌లంతా కాంగ్రెస్ పక్షాన నిలబడాలని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 17 స్థానాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యాదయ్య, రాములు, వెంకటేశ్, మురళి, కృష్ణ, ప్రభు, గోపాల్, అశోక్, శ్రీను, వెంకటేశ్, రాజ్ కుమార్, అంతయ్యా, కార్యకర్తలు, ఎస్‌ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్రంలో కొత్తగా 16 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో ఆయా సంఘాల నాయకులు బుధవారం జిన్నారంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముదిరాజ్ సంఘం, మత్స్య సహకార సంఘాల నాయకులు సీఎంకు కృతజ్ఞతలు చెప్పారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు అండగా ఉండాలని సంఘాల నాయకులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మహేశ్, సత్యనారాయణ, నర్సింహ్మా, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: లింగాయత్ కులస్తులకు సంబంధించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు హర్షిస్తూ బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నారాయణఖేడ్‌కు చెందిన టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్ లింగాయత్‌లతో కలిసి వెళ్లి సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి కటౌట్‌కు క్షీరాభిషేకం చేసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ లింగాయత్ సమాజ్ బాధ్యులతో కలిసి మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌లను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఖేడ్ బసవేశ్వరచౌక్‌లో సాగర్ షెట్కార్ ఆధ్వర్యంలో లింగాయత్‌లు మిఠాయిలు పంచుతూ సంబురాలు చేసుకున్నారు.

సంగారెడ్డిలో ఆర్యవైశ్యుల సంబరాలు

సంగారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. టపాకాయలు కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, కోశాధికారి ప్రకాశ్, సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే రాష్ట్రం, దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధిలో హెచ్‌ఐజీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్తూ ఎంతో ప్రతిభను కనబరుస్తున్నారని తెలిపారు. మహిళా మండలి అధ్యక్షురాలు కాత్యాయని, కార్యదర్శి దాక్షాయని, కీరవాణిలు పాల్గొన్నారు.

◆ గ్రామాల అభివృద్ధే ధ్యేయం

సదాశివపేటరూరల్ (సంగారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తోందని ఎంపీటీసీ ఒగ్గు శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో బుధవారం రూ.10లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు ఖలీల్, మాజీ సర్పంచ్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, నాయకులు అశోక్, మల్లేశం, హరికాంత్, కుమార్, సలీం, హైదర్, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

నారాయణఖేడ్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేస్తున్న మండలంలోని సంజీవన్‌రావుపేటకు చెందిన బోడ నాగభూషణం(47) అనారోగ్యంతో బాధపడుతూ సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం సంజీవన్‌రావుపేటలో జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు. మృతిపట్ల పలు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

◆ సీఐకి సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం సీఐగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌ను స్థానిక నాయకులు బుధవారం సన్మానించారు. బీఆర్‌ఎస్ నేత యాదిరెడ్డితో పాటు స్థానిక యువజన సంఘాల నాయకులు సీఐని సన్మానించారు.

◆ నేడు మండల సమావేశం

మునిపల్లి(అందోల్): ఈ నెల 14వ తేదీ ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శైలజాశివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షిసాయి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ హరినందన్‌రావు బుధవారం తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పూర్తి స్థాయి వివరాలతో రావాలన్నారు. సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ ఆర్డీఓను కలిసిన రేషన్ డీలర్ల సంఘం నాయకులు

జహీరాబాద్: జహీరాబాద్ ఆర్డీఓగా నూతనంగా వచ్చిన ఎస్.రాజును రేషన్ డీలర్ల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం వారు ఆర్డీఓను కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు జి.విజేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సద్రుద్దీన్‌గౌరి, మచ్చేందర్ పాల్గొన్నారు.

◆ సీసీరోడ్డు పనులు ప్రారంభం

మునిపల్లి(అందోల్): ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో ప్రతి కాలనీలో సీసీరోడ్లు వేస్తామని మునిపల్లి ఎంపీటీసీ విజయ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మునిపల్లి రాజనర్సింహ కాలనీలో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజుపటేల్, ఎల్లాగౌడ్, మాజీ ఎంపీటీసీ యాదయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


సామూహిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జహీరాబాద్: పట్టణంలో మూడురోజుల పాటు నిర్వహించిన 1008 సామూహిక నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు 400 మంది దంపతులు తరలివచ్చి హోమం, నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అష్టోత్తర సహస్ర నాగదేవతా, మానసాదేవి సమేత మహాంకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి శివనాగసర్ప విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, సిద్ధేశ్వర స్వాములు మహోత్సవాలను పర్యవేక్షించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జహీరాబాద్ పట్టణంలో ఇంత పెద్ద మొత్తంలో నాగదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించడం ఒక రికార్డు అని నిర్వాహకులు పేర్కొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు


నీలం మధు ముదిరాజ్‌తో నిర్వాహకులు

పటాన్‌చెరుటౌన్: అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లి గ్రామంలో శ్రీకోదండ సీతారామచంద్ర, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉత్సవాలకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చారు. నిర్వాహకులు ఆయనను సత్కరించారు.